క్లుప్తంగా

చిన్నారులకు డ్యాన్స్‌లో శిక్షణ



శిక్షణ పొందుతున్న చిన్నారులు

మల్కాపురం: బన్నీస్ డ్యాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో చిన్నారులకు డ్యాన్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రముఖ కొరియోగ్రాఫర్ బన్నీస్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రాక్,డిస్కో,వెస్టన్,ఫోక్ డ్యాన్స్‌లో శిక్షణ ఇస్తామని చెప్పారు. చిత్రలేఖనం, మ్యూజిక్‌లో కూడా తమ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తామన్నారు.ఆసక్తి గల వారు 8978751234 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సీతమ్మధార: జోన్–2 సబ్ డివిజన్ పరిధిలో 11 కేవీ కరాస ఫీడర్, 11 కేవీ తెన్నేటినగర్ ఫీడర్, ఎస్ఎస్‌బీఎల్ పెట్రోల్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు న్యూ కరాస, ఓల్డ్ కరాస, తెన్నేటినగర్ ఫీడర్ పరిధిలోని కనకదుర్గ, ఫంక్షన్ హాల్ జంక్షన్, మాధవధార, గాయత్రి విద్యా మందిర్ రోడ్డు, జనతా గ్యారేజ్ జంక్షన్, గ్యాస్ గొడౌన్, తెన్నేటినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

నిరంతర అన్నదాన సేవలకు రెండేళ్లు



కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌లో భద్రపరచిన ఆహారాన్ని అన్నార్తులకు అందిస్తున్న శేషగిరిరావు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో నిరంతర అన్నదానం కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌కు రెండేళ్లు పూర్తయ్యాయి. ధ్యాన మందిరంలో కొన్నేళ్లుగా నిరాటంకంగా కొనసాగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి మరింత ప్రోత్సాహమిచ్చేలా ఇంటర్నేషనల్ వైజ్ మెన్ క్లబ్ సహకారంతో 2022 మే 16న రెండు కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం జరుగుతున్న అన్నదానంలో పాల్గొంటున్న వారికి అదనంగా 24 గంటలు ఏ సమయంలోనైనా ఆకలితో ఉన్నవారు ఈ ఫ్రిడ్జ్‌ల్లో నుంచి ఆహారం తీసుకోవచ్చు. ప్రతి రోజు దీనిలో ఆహారాన్ని ప్యాకెట్ల రూపంలో భద్రపరుస్తున్నారు. రెండేళ్లుగా ప్రతి రోజు కనీసం 50 నుంచి 100 మంది ఆకలిని తీర్చగలిగినందుకు తమకెంతో సంతోషంగా ఉందని ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు తెలిపారు.

కోదండ రాముడి పుష్పయాగానికి పూల తరలింపు

ఎంవీపీ కాలనీ: తిరుపతి శ్రీకోదండ రాముడి పుష్పయాగానికి విశాఖ నుంచి పూలు తరలివెళ్లాయి. ఆధ్యాత్మిక వేత్త హిమాంశు ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలలో సేకరించిన పూలను బుధవారం ఎంవీపీలోని టీటీడీ ఈ– దర్శనం కౌంటర్ వద్ద భక్తుల సందర్శనార్థం ప్రదర్శించారు. తిరుమల ఉత్సవాల్లో భాగంగా జరిగే పుష్పయాగానికి ఈ పూలు తరలిస్తున్నట్లు హిమాంశు ప్రసాద్ తెలిపారు. కలువలు, తామరలు, తులసి, మల్లి ఇలా వివిధ రకాలకు చెందిన 15 వేల పూలను సేకరించామన్నారు. ఈ పూల సంకల్పం చేసి అనంతరం బుధవారం సాయంత్రం తిరుమల తరలించామన్నారు. ఈ కార్యక్రమంలోని పలువురు ఎంవీపీ వాసులు, వెంకటేశ్వరస్వామి భక్తులు పాల్గొన్నారు.

12 పనులు.. రూ.1,325 కోట్లు

- రైల్వే బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి రైల్వే సుముఖత
- ఆడారి ఆనంద్ కుమార్ ప్రతిపాదనలకు ఆమోదం
- హర్షం వ్యక్తం చేస్తున్న నియోజకవర్గ ప్రజలు



దుర్గాపురం గ్రామం వ్యూ



కరాసా నుంచి దుర్గాపురం రాకపోకలకు రైలు పట్టాలు పైనుంచే..

గోపాలపట్నం: దీర్ఘకాలంగా రైల్వే శాఖతో ముడిపడి ఉన్న ఎన్నో సమస్యలను పరిష్కరించే దిశగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ చేసిన ప్రతిపాదనలు కొలిక్కి వచ్చాయి. రైల్వే అధికారులు వీటిపై సానుకూలంగా స్పందించి మొత్తం 12 పనులకు గాను రూ.1,325 కోట్లు మంజూరు చేశారు.

ప్రారంభించిన.. ప్రారంభించనున్న పనుల వివరాలు

ప్రధానంగా సుమారు 60 ఏళ్లుగా నలుగుతున్న దుర్గాపురానికి రైల్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఇక్కడ ప్రమాదకర ప్రయాణం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు క్షతగాత్రులు ఉన్నారు. ప్రస్తుతం కరాసా నుంచి దుర్గాపురానికి ఈ రైల్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ జరుగుతోంది. దీనికి రూ.140 కోట్లు వెచ్చిస్తున్నారు.

- గోపాలపట్నం నుంచి విమాననగర్ వైపు రైల్ ఓవర్ బ్రిడ్జ్, రైల్ అండర్ బ్రిడ్జ్ నిర్మిస్తున్నారు. ఇందుకు రూ.245 కోట్లు వెచ్చిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. – కొత్తపాలెం, గోపాలపట్నం సింహాచలం రైల్వే స్టేషన్ మీదుగా కొత్తపాలెం నరవ వెళ్లే రోడ్డుకు పాత గోపాలపట్నం వైపు రైల్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం చేయనున్నారు. దీనికి రూ.140 కోట్లు మంజూరు చేశారు.
- కొత్తపాలెం నుంచి విమాన్‌నగర్‌ను కలిపే విధంగా భూలోకమ్మ ఆలయం వద్ద నుంచి విమాననగర్‌కు వెళ్లేందుకు రైల్ ఓవర్ బ్రిడ్జ్, రైల్ అండర్ బ్రిడ్జ్ నిర్మించేందుకు రూ.150 కోట్లు మంజూరు చేశారు.
- గవర జగ్గయ్య పాలెం వద్ద రైల్ అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి రూ.40 కోట్లు, ఆశావానిపాలెం వద్ద లిమిటెడ్ హైట్ సబ్ వే రూ.40కోట్లతో, కంచర పాలెంలో రైల్వే ట్రాక్ ఇరువైపులా 4 లిమిటెడ్ హైట్ సబ్‌వేలు రూ.120 కోట్లతో నిర్మించనున్నారు.
- పూడితల్లమ్మ గుడి నుంచి డీజిల్ కాలనీకి రైల్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి రూ.120 కోట్లు, రామ్మూర్తిపంతులు పేట వద్ద లిమిటెడ్ హైట్ సబ్‌వే నిర్మించేందుకు రూ.40 కోట్లు, వెంకటాపురం నుంచి కొత్తపాలెం వెళ్లేందుకు ఆర్‌వోబీ కోసం రూ.130 కోట్లు, ములగాడ నుంచి పోర్టు కనెక్టింగ్ హైవేకు కలుపుతూ ఆర్‌వోబీ నిర్మాణం రూ.120 కోట్లతో చేపట్టనున్నారు. దీని వల్ల సింధియా, మల్కాపురం, శ్రీహరి పురం, గాజువాక ప్రాంతాల వారికి నగరంలోకి వెళ్లేందుకు సుగమం అవుతుంది.
- కంచరపాలెం పైడితల్లమ్మ గుడివద్ద లిమిటెడ్ హైట్ సబ్‌వే నిర్మాణానికి రూ.40 కోట్లు వెచ్చించనున్నారు. మొత్తంగా 12 పనులకు గాను రూ. 1325కోట్లు రైల్వే శాఖ మంజూరు చేసింది.

త్వరలో పనులు ప్రారంభం

ఈ పనులు త్వరలో మొదలు కానున్నాయని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ తెలిపారు. నియోజకవర్గంలో రైల్వే శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి సమస్యలు తీసుకెళ్లగా రైల్వే అధికారులతో సమావేశం నిర్వహించడంతో ప్రతిపాదనలకు ఆమోదం లభించిందని తెలిపారు.



అధ్వానంగా ఉన్న వెంకటాపురం నుంచి కొత్తపాలెం వెళ్లే రహదారి (పాతచిత్రం)

ఇలాంటి నాయకుడు కావాలి



ఆడారి ఆనంద్ కుమార్ లాంటి నాయకుడు నియోజకవర్గానికి ఎంతో అవసరం. దీర్ఘ కాలిక సమస్యలు పరిష్కరించేందుకు ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. ఇంతవరకు ఏ ఎమ్మెల్యే కూడా ఇన్ని నిధులు మంజూరు చేయించలేదు.

–జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్, 52వ వార్డు

60 ఏళ్ల సమస్య పరిష్కారం దిశగా..

60 ఏళ్లుగా ఉన్న సమస్యలు పరిష్కారం అవుతోన్నాయని తెలిసి సంతోషంగా ఉంది. మా దుర్గాపురానికి ఇళ్ల పట్టాలు, రహదారి సమస్య ఉంది. రహదారి లేక రైల్వే ట్రాక్‌పై ప్రమాదకరంగా ప్రయాణించి మా గ్రామస్తులు చేతులు, కాళ్లు పోగొట్టుకున్నారు. కొన్ని ప్రాణాలు కూడా పోయాయి. ఇపుడు రైల్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం అయితే సమస్య తీరుతుంది. దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆడారి ఆనంద్ కుమార్‌కు ధన్యవాదాలు. –హేమలత, దుర్గాపురం

ఎండైనా.. వానైనా



ఆరిలోవపురం బస్టాప్ వద్ద చెట్టునీడలో ప్రయాణికులు

- ముఖ్య కూడళ్లలో కానరాని బస్‌షెల్టర్లు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

మల్కాపురం: పారిశ్రామిక నగరంలోని పలు ముఖ్య కూడళ్లలో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నిలువ నీడ లేకపోవడంతో అధిక ఉష్ణోగ్రతలకు సొమ్మసిల్లుతున్నారు. వేడికి తట్టుకోలేక స్టాప్‌కు దూరంగా ఉండే చెట్ల కింద నిరీక్షిస్తున్నారు. ఎండైనా, వానైనా ఇబ్బందులు పడుతున్నారు. పారిశ్రామిక ప్రాంతంలో ప్రధాన కూడళ్లు అయిన మల్కాపురం, శ్రీహరిపురం,ఆరిలోవపురం,గాజువాక ఆర్టీసీ డిపో, జింక్ ఆంజనేయస్వామి ఆలయం తదితర సెంటర్లలో షెల్టర్లు లేవు. ఆయా ప్రధాన సెంటర్ల నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. కనీస నీడ లేకపోవడంతో ఎండలకు వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వసతులతో కూడిన షెల్టర్లు ఏర్పాటు చేయాలని గాజువాక ఆర్టీసీ డిపో యాజమాన్యానికి వినతులు ఇచ్చినా స్పందన లేదని ఆరోపిస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి

గాజువాక ఆర్టీసీ డిపో పరిధిలోని పలు కూడళ్లలో షెల్టర్లు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం. వారు స్పందించి జీవీఎంసీ ఉన్నతాధికారులకు షెల్టర్లు ఏర్పాటు చేయాలని లేఖ రాశారు. జీవీఎంసీ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే షెల్టర్ల నిర్మాణం చేపడతాం.

–ప్రవీణ, గాజువాక ఆర్టీసీ డిపో మేనేజర్

కంప్యూటర్ ల్యాబ్ ఆధునికీకరణకు భూమిపూజ

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఆధునికీకరణ పనులకు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ అధికారులు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.34లక్షలతో ఈ ఆధునికీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పనులు పూర్తి చేసిన వెంటనే 25 కంప్యూటర్లు, టేబుళ్లు, కుర్చీలను అందజేయనున్నామని వివరించారు. విద్యార్థులకు ఆధునిక సదుపాయాలతో కూడిన ల్యాబ్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బాలికల ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ల్యాబ్ ఆధునికీకరణ పనులకు భూమి పూజ చేస్తున్న కోరమాండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు

'బీజేపీ వచ్చాకే ప్రభుత్వరంగ సంస్థలు నాశనం'

అగనంపూడి: బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో దాదాపు అన్ని ప్రభుత్వరంగ సంస్థలు సర్వనాశనం అయ్యాయని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకుడు వి.శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1189వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి రాకముందు బ్యాంకులు డిపాజిట్ల కోసం విశాఖ ఉక్కు ముందు మోకరిల్లేవని, కాని నేడు ఆయా సంస్థలు భిన్నంగా వ్యవహరిస్తున్నాయంటే దానికి కారణం కేవలం బీజేపీ ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. దేశానికి వెన్నుదన్నుగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో పాటు పలు ప్రభుత్వ రంగ సంస్థలు నేడు దయనీయ స్థితికి వెళ్లాయంటే కారణం కేవలం కేంద్ర ప్రభుత్వ తీరే అన్నారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రప్రభుత్వం పునరాలోచించాలన్నారు.

వీరభద్ర విజయం.. విశిష్ట కావ్యం

సీతంపేట: సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం 'పోతన వీరభద్ర విజయం' అనే అంశంపై ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ అయ్యగారి సీతారత్నం ప్రసంగం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోతన వీరభద్ర విజయం భాగవతానికి ముందే రాశారని ఆధ్యాత్మిక భావాలతో నిరూపించారు. పోతన ఈశ్వర భక్తి ఈ కావ్యంలో స్పష్టమవుతుందని, అనంతర కాలంలో భాగవతం రాసేటప్పటికీ విశేషంగా పోతన పరిణితి పెరిగిందని తెలుసుకోవచ్చునన్నారు. వీరభద్ర విజయంలోని పద్యాలు పఠనీయంగా పోతన శైలి, శబ్దాలంకార ప్రీతి సుస్పష్టమవుతుందన్నారు. లాటానుప్రాసం, వృత్యానుప్రాసం అద్భుతంగా ప్రయోగించారని చెప్పారు. సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ వీరభద్ర విజయం మంచి కవిత్వ పటుత్వంతో రాసిన కావ్యమని తెలిపారు. దీని మూలం వాయు పురాణంలోనిదన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ పోతన రాసిన వీరభద్ర విజయం శైవమత ప్రధాన మైనదని, శివుడి జటాజూటం నుంచి ఉద్భవించిన వీరభద్రుడు, దక్షుని సంహరించడం ప్రధాన ఇతివృత్తమని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.జి.వేణు, ఎస్.విజయ్‌కుమార్, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య అయ్యగారి సీతారత్నం

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

అగనంపూడి: అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్ బాబు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఎంపీసీలో 88 సీట్లు, ఆర్ట్స్‌లో ఒక్కో గ్రూపులో 40 సీట్ల వంతున ఉన్నాయన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో కూడా సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు బైపీసీ గ్రూప్‌పై ఆసక్తి కనబరచడంతో ఈ ఏడాది నుంచి ఆ గ్రూపు ఏర్పాటుకు అధికారులను అనుమతి కోరామన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే బైపీసీ గ్రూపును ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, ఎం.మస్తాన్ రెడ్డి, లెక్చరర్లు డి.దివ్య, రత్నం, సూర్య శంకరరావు పాల్గొన్నారు.



దరఖాస్తులు అందిస్తున్న ప్రిన్సిపాల్

బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె

నేడు ఉత్సవాలకు అంకురార్పణ

పెందుర్తి: బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు పెందుర్తి వెంకటాద్రి సిద్ధమైంది. శ్రీనివాసుడు పద్మావతి అమ్మవారిని వివాహమాడేందుకు భూమి మీద అడుగిడిన పవిత్ర రోజు వైశాఖ శుద్ధదశమి నాడు ఏటా బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. పెందుర్తి వెంకటాద్రి నిర్మాణానికి కూడా వైశాఖ శుద్ధ దశమి నాడే తొలి అడుగు పడింది. ఈ క్రమంలో ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించే వెంకటాద్రిపై వైశాఖ శుద్ధ దశమి(శనివారం) నాడు కల్యాణం చేస్తారు. ఈ క్రమంలో వెంకటాద్రి పై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు విష్వక్సేన పూజ, అంకురార్పణ జరుగుతుంది. రెండో రోజు శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, హోమాలు చేస్తారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు జరుగుతాయి. మూడోరోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీసులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వెంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



వేంకటేశ్వరస్వామి

దారి ఇరుకై.. ప్రయాణం నరకమై..!

- మల్కాపురం–సింధియా రోడ్డులో భారీ వాహనాల పార్కింగ్
- ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు
- చర్యలు తీసుకోవాలని స్థానికుల వినతి



మల్కాపురం కేంద్రీయ విద్యాలయం గేటు రోడ్డుపై భారీ వాహనాల పార్కింగ్



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద ప్రధాన రహదారిపై పార్క్ చేసిన భారీ వాహనాలు

సింధియా: మల్కాపురం నుంచి సింధియాకు వెళ్లే ప్రధాన రహదారిలో ప్రయాణమంటేనే ద్విచక్ర వాహన చోదకులు హడలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. గాజువాక నుంచి శ్రీహరిపురం, మల్కాపురం మీదుగా సింధియాకు వెళ్లే రోడ్డులో నిత్యం అనేక వాహనాలు ప్రయాణిస్తుంటాయి. శ్రీహరిపురంలో కోరమాండల్ ఫెర్టిలైజర్స్, మల్కాపురంలో హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ వంటి పరిశ్రమలకు నిత్యం మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాటిని రోడ్డుపై పార్క్ చేసి రోజులు కొద్దీ ఉంచేయడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించి స్థానికులు, వాహన చోదకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ పరిశ్రమలకు ఎగుమతి, దిగుమతుల కోసం వచ్చే భారీ వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ స్థలం కరువైంది. ఆ దిశగా యాజమాన్యాలు చర్యలు తీసుకోకపోవడంతో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది.

ప్రమాదాల బారిన ప్రయాణికులు

పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలను రోడ్లపైనే రోజుల తరబడి పార్క్ చేసి ఉంచడంతో ఆ వాహనదారులు రోడ్డు మీదే స్నానపానాలు, వంటావార్పు వంటి దైనందిన కార్యకలాపాలను చేసుకుంటున్నారు. దీంతో ఈ మార్గంలో వచ్చే పోయే వాహనాలకు ఇబ్బందికరంగా మారుతోంది. మల్కాపురం–సింధియా మార్గంలో వీధి లైట్లు సరిగ్గా వెలగకపోవడంతో అటుగా ప్రయాణించే వారు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లపై పార్క్ చేసిన భారీ వాహనాలను చీకటిలో గుర్తించలేక ఎందరో ప్రమాదాల బారిన పడుతున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పార్కింగ్ స్థలం ఏర్పాటులో నిర్లక్ష్యం

అధికారులు పార్కింగ్ చేసిన భారీ వాహనాలకు ఎప్పటికప్పుడు జరిమానాలు విధిస్తున్నా.. వాహనదారుల్లో మాత్రం మార్పు రావడం లేదని ట్రాఫిక్ పోలీసులు సైతం చెబుతున్నారు. ఆయా పరిశ్రమల యాజమాన్యంతో సంప్రదింపులు జరిపినా.. పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలతో రహదారులు ఇరుగ్గా మారడం.. ట్రాఫిక్ సమస్య పెరగడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపం వద్ద రోడ్డుపై నిలిపి ఉంచిన వాహనాలు

రాంగ్ పార్కింగ్‌ను నిరోధించాలి



మల్కాపురం–సింధియా ప్రధాన రహదారిపై భారీ వాహనాల పార్కింగ్‌ను నిరోధించాలి. రాత్రి వేళ ఈ మార్గంలో ప్రయాణం చేసేందుకు భయపడి వెళ్లకుండానే ఆగిపోతున్నాం. ఇక్కడి పరిశ్రమలకు వస్తున్న భారీ వాహనాలను రోజుల కొద్దీ నిలిపి ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– సూర్యప్రకాష్, శ్రీహరిపురం

నిత్యం ఇబ్బందులు పడుతున్నాం



మల్కాపురం నుంచి సింధియా వరకు ఉన్న ప్రధాన రహదారిపై పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలను పార్క్ చేసి ఉంచడంతో సాధారణ వాహనాల రాకపోకలకు నిత్యం ఇబ్బందిగా ఉంది. భారీ వాహనాల రాంగ్ పార్కింగ్‌తో ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్య తలెత్తడమే కాకుండా స్థానికులకు సైతం సమస్యగా మారుతోంది.

– కృష్ణ, మల్కాపురం

కల్యాణ వైభోగం





పాల్గొన్న ఉభయదాతలు, కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.